ప్రభుత్వ ల్యాబ్‌లో అరకొర సేవలు

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు ఆక్వా ల్యాబ్‌లు

చేపలు, రొయ్యల వ్యాధి నిర్ధారణ కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆక్వా ల్యాబ్‌లో సేవలు సిబ్బంది కొరతతో మందగిస్తున్నాయి. ఇదే అదనుగా ప్రైవేటు ల్యాబ్ యాజమాన్యాలు ఆక్వా రైతులను అందినకాడికి దోచుకుంటున్నాయి. పాలకులు పట్టించుకోవడం లేదని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్

కైకలూరు: ఆక్వారంగం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ పాలనలో ల్యాబ్‌లను ఆధునికీకరించారు. అయితే ఆక్వా రంగాన్ని ఆదుకుంటామని గొప్పలు చెబుతున్న కూటమి నేతలు ల్యాబ్‌లో సౌకర్యాలపై దృష్టి పెట్టడం లేదు. దీంతో రూ.లక్షల పెట్టి కొనుగోలు చేసిన ల్యాబ్ పరికరాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఆక్వా పరిశ్రమ నియోజకవర్గంలో అధికంగా విస్తరించిన నేపథ్యంలో కైకలూరులో 2005లో రాష్ట్ర మంచినీటి సంవర్ధక రిఫరల్ లేబొరేటరీని ఏర్పాటు చేశారు. కాకినాడ తర్వాత రాష్ట్రంలో కైకలూరులో రెండో ల్యాబ్ ఏర్పాటు చేయడం విశేషం. ఆక్వా ఉత్పత్తుల్లో రాష్ట్రంలోనే కైకలూరు ప్రాంతం ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ల్యాబ్ ఆధునికీకరణకు రూ.18.60 లక్షలు కేటాయించి పనులు పూర్తి చేయించారు. నియోజకవర్గంలో కైకలూరు మండలంలో 15,600 ఎకరాలు, కలిదిండి మండలంలో 19,339 ఎకరాలు, మండవల్లి మండలంలో 19.122 ఎకరాలు, ముదినేపల్లి మండలంలో 13,169 ఎకరాలు కలిపి మొత్తం 67,230 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. దాదాపు 12,900 మంది రైతులతోపాటు, అనేకమంది ఉద్యోగులు, కూలీలు ఆక్వారంగంపై ఆధారపడి జీవిస్తున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఆక్వా ల్యాబ్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ల్యాబ్‌కు ప్రత్యేకంగా ఏడీ ఉండాలి. కైకలూరులో ల్యాబ్ ఏడీగా బి.రాజ్‌కుమార్ ఉన్నప్పటికీ ఆయనను ఏలూరు ల్యాబ్‌కు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో అశోక్ అనే మల్టీపర్పస్ టెక్నీషియన్ విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ల్యాబ్ ఎఫ్‌డీఓగా సీహెచ్.గణపతి వచ్చారు. ల్యాబ్‌లో మైక్రో బయోలజీ, హిస్టో పాథాలజీ, నీటి, మట్టి, మేత, పీసీఆర్ పరీక్షలు వంటివి చేస్తున్నారు. వీటన్నింటికీ సాధారణంగా ఒక్కో టెక్నీషియన్ అవసరమవుతారు. ప్రస్తుతానికి ల్యాబ్ టెక్నీషియన్, పూర్తిస్థాయి ల్యాబ్ ఏడీ అవసరమవుతారు.


సిబ్బంది నియామకం లేకపోవడంతో మూసివేసిన ఎలిషా టెస్టు ల్యాబ్ గది

ఇదే కాకుండా ఆధునికీకరణలో భాగంగా క్లోరమ్ ఫెనికాల్, నైట్రో ఫ్యూరాన్, మెటబాలైట్ పరీక్షల కోసం ఎంజైమ్ లింక్డ్ ఇమ్యునో సోర్బెంట్ ఆస్సే (ఎలిషా) ల్యాబ్‌ను ఏర్పాటు చేసినా ఇక్కడ సిబ్బంది లేరు. ఇదే కాకుండా ల్యాబ్ దిగువ భాగం మత్స్యశాఖ కార్యాలయంలో ఏడీ, గుమస్తా, అటెండర్, వాచ్‌మెన్, ఫిషర్ మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కొన్నింటికే అనుమతులు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీసడా) యాక్టు ప్రకారం ప్రైవేటు ఆక్వా ల్యాబ్‌లు లైసెన్సులు పొందాలి. రెన్యువల్ కూడా విధిగా చేయించాలి. అటువంటిది కైకలూరు నియోజకవర్గంలో చిన్న, పెద్ద కలిపి 55 ఆక్వా ల్యాబ్‌లు ఉన్నాయి. వీటిలో కేవలం 15 ల్యాబ్‌లకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. ప్రభుత్వ ల్యాబ్‌లో పీసీఆర్ టెస్టుకు రూ.600 తీసుకుంటే, ప్రైవేటు ల్యాబ్‌లలో రూ.2వేలకుపైనే వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ల్యాబ్‌లో పీహెచ్, సెలినిటీ, డీఓ, అల్కనిటీ, టీడీఎస్ వంటి పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. వీటిన్నింటికీ ప్రైవేటు ల్యాబ్‌లో రూ.250 పైనే తీసుకుంటున్నారు. అనుమతులు లేని ప్రైవేటు ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



రాష్ట్రంలో కైకలూరు ప్రాంతానికి ఆక్వా రంగంలో మంచి పేరుంది. నియోజకవర్గంలో అనేక మంది ఆక్వా రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వ ఆక్వా ల్యాబ్‌లో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. నూతన ప్రభుత్వం ఆక్వా రైతుల కోసం పూర్తిస్థాయి ఇబ్బందిని నియమించాలి.

– బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, ఆక్వా రైతు, మండవల్లి

వైరస్ వ్యాధులతో నష్టపోతున్నాం



చేపల, రొయ్యల సాగులో వైరస్, బ్యాక్టీరియా వ్యాధులతో తీవ్ర నష్టం జరుగుతోంది. ప్రభుత్వ పరంగా కైకలూరులో ల్యాబ్ ఉన్నప్పటికీ అనేక మంది ఆక్వా రైతులకు అక్కడ లభించే సేవలపై అవగాహన లేదు. దీంతో ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

– ఎం.శ్రీనివాసరావు, ఆక్వా రైతు, చినకామనపూడి, ముదినేపల్లి మండలం

త్వరలో సిబ్బంది నియామకం



కైకలూరు ల్యాబ్‌లో సిబ్బంది కొరత వాస్తవమే. ప్రభుత్వం త్వరలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు చేపట్టే అవకాశం ఉంది. పలు పరీక్షల నిర్వహణకు కాకినాడ ల్యాబ్‌లో శిక్షణ తీసుకోవాలి. దీంతో సిబ్బంది నియామకంలో జాప్యం నెలకొంది. క్షేత్రస్థాయిలో విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్లు సేవలు అందిస్తున్నారు.

– బి.రాజ్‌కుమార్, ల్యాబ్ ఏడీ, కైకలూరు

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గుడ్లవల్లేరు: మండలంలో చినగొన్నూరు (ఎస్సీ), సింగలూరు (బీసీ మహిళ), గుడ్లవల్లేరు (ఓసీ)లో రేషను దుకాణాలను నిర్వహించే ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ బి.లోకరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరు తేదీ అని పేర్కొన్నారు. 18న రాత పరీక్ష, 21న మౌఖిక పరీక్షతో పాటు ఇంటర్వ్యూ స్థలాన్ని దరఖాస్తుదారునకు కేటాయించే టికెట్‌లో ఉంచుతామని లోకరాజు పేర్కొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



గుడివాడ టౌన్: సినీ గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుకలు బుధవారం జరిగాయి. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఘంటసాల స్మారక సంగీత కళాపీఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ జయంతి వేడుకల్లో ఘంటసాల గేయాలు ఆలపించి ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అట్లూరి గాంధి, ఎ.తిరుమలేశ్వరరావు, పి. శ్రీనివాసరావు, జి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, దండమూడి సీతారామస్వామి, కె. సుకన్య, బి. నవీన్, పి. జాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కళ్లజోళ్ల పంపిణీ



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో వడ్లమన్నాడు, విన్నకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 77 మంది విద్యార్థులకు బుధవారం లయన్స్ ఫస్ట్ వైస్ గవర్నర్ వి.వి.పి.ఎస్.ఆంజనేయులు ముఖ్య అతిథిగా విచ్చేసి ఉచిత కళ్లజోళ్ల పంపిణీని చేపట్టారు. వెస్టిండీస్‌కు చెందిన నర్రా గంగాధరరావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు పరంధామయ్య, సుధాకర్, ప్రభాకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినికిడి లోపం ఉన్న చిన్నారికి రూ.5.33 లక్షల మంజూరు



గుడ్లవల్లేరు: వెణుతురుమిల్లికి చెందిన కొప్పినేని నాగ భువనేశ్వరి అనే ఏడేళ్ల చిన్నారి పుట్టుకతో రెండు చెవులు లేక వినికిడి లోపంతో బాధ పడుతోంది. ఆ చిన్నారికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము రూ.5,33,624 వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం మంజూరు చేసినట్లు కూచికాయలపూడి మాజీ సర్పంచ్ కొడాలి రామరాజు తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేతో పాటు ఏపీ ఎస్‌డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుకు చిన్నారి తండ్రి కొప్పినేని మోహనరావు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సంతాన నాగేంద్రుని విగ్రహ ప్రతిష్ట



కైకలూరు: సుబ్రహ్మణ్య నామస్మరణతో స్థానిక ఏలూరు రోడ్డు కాలువగట్టు ప్రాంతం మార్మోగింది. సంతాన నాగేంద్రస్వామి, శిఖర, నాగబంధ, మయూర వాహన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా బుధవారం నిర్వహించారు. ఈ నెల 2 నుంచి ప్రతిష్ట మహోత్సవ పూజలను వంశపరంపర్య ధర్మకర్త చావలి శంకరశాస్త్రి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

కలిదిండి(కైకలూరు): బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ ఎస్‌కే రమేష్ బుధవారం తెలిపారు. నియోజకవర్గం నాలుగు మండలాల్లో దాడులు నిర్వహించగా కలిదిండి మండలం తాడినాడ గ్రామానికి చెందిన గొర్ల నాగలక్ష్మి నుంచి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం అక్రమ విక్రయాలు కొనసాగిస్తే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ఆదినారాయణ, అలీం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నాగధర్మ ఉత్సవాలు

ముదినేపల్లి రూరల్: ఊటుకూరు నాగేంద్రస్వామి ఆలయం వద్ద ఈ నెల 6 నుంచి నాగధర్మ పేరుతో షష్టి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవాల కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలు ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా 6న స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి, పుట్టలో పాలు పోయడం, చంద్ర ఆరాధన, అదే రోజు రాత్రి స్వామి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా 7న కావిడి ఉత్సవం, గంగాహారతి, 8న తారకాసుర దహనం, కోటి ఒత్తులతో అఖండ జ్యోతి దర్శనం అనంతరం తెప్పోత్సవం, 9న ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి షష్టి మహోత్సవాలు

మండవల్లి: మండవల్లిలోని నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి 41వ షష్టి మహోత్సవాలు 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ ధర్మకర్తల మండలి సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తేదీన ఉదయం 8 గంటలకు ఉత్సవ ప్రారంభం, 7న ఉదయం నుంచి స్వామికి పాలు పోసి, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 8న భజన కార్యక్రమం, 9న సాయంత్రం 6 గంటల నుంచి భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



ముదినేపల్లి రూరల్: అల్లూరు జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని విద్యా కమిటీ చైర్మన్ శీలం శ్యామల బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం తయారుచేసేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం రామోజీరావును కోరారు. కమిటీ సభ్యులతో పాటు స్థానిక నాయకులు దావు నాగరాజు, బి వెంకటరత్నం, శ్రీను, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు

పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్


పెదపారుపూడి పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

గుడివాడరూరల్: వైఎస్సార్ సీపీ నాయకులపై కావాలనే కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గుడివాడకు చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను తొమ్మిది మందిని 2022 డిసెంబర్‌లో జరిగిన ఘర్షణకు సంబంధించి కేసులో గుడివాడ వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని పెదపారుపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ బుధవారం ఉదయం పెదపారుపూడిలో ఉన్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను పరామర్శించేందుకు వస్తున్నారనే సమాచారం ముందుగానే తెలుసుకున్న పోలీసులు కావాలనే నందివాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా పెదపారుపూడి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కైలే అనిల్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, సానుభూతి పరులపై కావాలనే కక్ష్య సాధింపుతో వేధింపులకు గురి చేయడం సరి కాదన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదన్నారు. ప్రజలు అధికారం అప్పగించినందుకు ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కనీసం ప్రభుత్వం కానీ, ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించి కేవలం వైఎస్సార్ సీపీ నాయకులు, సానుభూతిపరులపై కక్ష్య సాధించేలా వ్యవహరించడం సరికాదన్నారు. తుపాను ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కనీసం పట్టించుకోని ప్రభుత్వం గతంలో ఎప్పుడో జరిగిన చిన్న, చిన్న ఘర్షణలు బయటకు తీసి ఆత్మ సంతృప్తి పొందుతున్నారని విమర్శించారు. ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజలతో పాటు, రైతులు కూడా ఆవేదన చెందుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వారే కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని కైలే హెచ్చరించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

వాలీబాల్ విజేత తాడినాడ జట్టు


మొదటి బహుమతి సాధించిన వాలీబాల్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా కలిదిండి మండలం తాడినాడ జట్టు నిలిచింది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన తల్లి దివంగత రాజేశ్వరమ్మ పేరుతో టోర్నమెంటు మూడు రోజుల పాటు తాలూకా సెంటర్‌లో నిర్వహించారు. మొత్తం 38 జట్లు పోటీపడ్డాయి. విజేతలకు ఎమ్మెల్యే కామినేని బుధవారం బహుమతులు, షీల్డ్‌లు అందించారు. మొదటి బహుమతి తాడినాడ జట్టు, రెండో బహుమతి కైకలూరు శివారు దానగూడెం, మూడో బహుమతి కైకలూరు మండలం భుజబలపట్నం, నాల్గో బహుమతి ఆతిథ్య కైకలూరు జట్టు సాధించాయి. కైకలూరు ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ రూ.20 వేలు, ఆటపాకకు చెందిన వేల్పూరి చంద్రయ్య రూ.15 వేలు, కైకలూరుకు చెందిన బి.వెంకటరావు రూ.10వేలు, కైకలూరుకు చెందిన పి.శ్యామలరావు రూ. 8వేలు నగదు బహుమతులకు దాతలుగా వ్యహరించారు. ఆటలో ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఎంపీటీసీ రామకృష్ణ వాలీబాల్ కోర్టు చుట్టూ ఫెన్సింగ్ నిర్మించి, రాత్రి వేళ ఆటలాడేందుకు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. న్యాయ నిర్ణేతలుగా నాగరాజు, సుబ్బరాజు, వేణు వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కూటమి నేతలు పోలవరపు లక్ష్మీరాణి, పూలా రాజీ, కొల్లి బాబీ, తాడినాడ బాబు, పెన్మత్స త్రినాథరాజు, బీకెఎం.నానీ, నిర్వాహకులు పవన్, సోములు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పెదపారుపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వై.రంగారావు బుధవారం తెలిపారు. ఈ నెల 6న భూషణగుళ్ల సచివాలయం వద్ద ఉదయం 9 నుంచి రెండు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 7న గుర్విగుంట, 9న మహేశ్వరపురం, 10న చినపారుపూడి, 11న అప్పికట్ల, 12న జువ్వనపూడి, 13న పాములపాడు, 16న సోమర్పాడు, 18న యలమర్రు, 20న మోపర్రు, 23న వింజరంపాడు, 26న పెదపారుపూడి, 28న ఈదులమద్దాలి, 30న వానపాముల, 2025 జనవరి 2న జమిదింటకుర్రు, 4న కొర్నిపాడు, 6న రావులపాడు, 18న వెంట్రప్రగడలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కైకలూరు: నిరుద్యోగ యువతీయువకుల్లో నైపుణ్యాల అభివృద్ధి కోసం ఉపాధి శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నామని కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కిషోర్ బుధవారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ హబ్ శిక్షణ అందిస్తామన్నారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసోసియేటెడ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ అసిస్టెంట్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణ అదించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పించేందుకు కొన్ని పరిశ్రమల యాజమాన్యాలతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ నెల 12 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి, ఖాళీగా ఉన్న యువతీయువకులు కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణలో 35 ఏళ్లలోపు వారికి మూడు నెలల కోర్సును అందిస్తామని తెలిపారు. వివరాలకు స్కిల్ హబ్ ట్రైనర్ సునీల్ 62811 19575, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ ప్రసాద్ 97013 57315 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి


శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న వేములపల్లి


గ్రంథాలయ పాఠకులతో మాట్లాడుతున్న వేములపల్లి

సాక్షి ఎఫెక్ట్

గుడివాడరూరల్: గుడివాడ షాగులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయాన్ని పాఠకులు, సాహితీవేత్తలు సద్వినియోగం చేసుకునేలా త్వరలోనే తాత్కాలిక మరమ్మతులు చేపడతామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ పేర్కొన్నారు. గత నెల 29వ తేదీన సాక్షిలో ప్రచురితమైన 'శిథిలావస్థలో షాగులాబ్ చంద్ గ్రంథాలయం' అనే కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం గ్రంథాలయాన్ని పరిశీలించారు. సమస్యలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ నుంచి వివరాలు తెలుసుకుని కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా వేములపల్లి మాట్లాడుతూ గ్రంథాలయ భవనం గురించి సత్వరమే ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సంప్రదిస్తామన్నారు. వారి సూచనల మేరకు దాతల సహకారంతో గ్రంథాలయ భవనాన్ని పూర్తిగా వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది టి.ప్రవల్లిక, పి.రవిచంద్ర పాల్గొన్నారు.

పెన్షనర్ మరణిస్తే ట్రెజరీకి తెలియజేయండి


కైకలూరు ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ల సమావేశం

కైకలూరు: పెన్షనర్ చనిపోయినా కొంతమంది కుటుంబ సభ్యులు ట్రెజరీకి సమాచారం తెలియజేయకుండా ఏటీఎం కార్డుతో పెన్షన్ సొమ్ము రూ.లక్షల్లో డ్రా చేస్తున్నారని, ఏటా లైఫ్ సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు ఇలాంటివి బయట పడుతున్నాయని ఏలూరు జిల్లా ట్రెజరీ ఉపసంచాలకులు పి.కృష్ణ పేర్కొన్నారు. కైకలూరు ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ల అసోషియేషన్, ట్రెజరీ అధికారులతో ముఖాముఖీ కార్యక్రమం బుధవారం నిర్వాహించారు. అధికారి కృష్ణ మాట్లాడుతూ పెన్షనర్ చనిపోయిన సమాచారాన్ని యూనియన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. పెన్షనర్ల న్యాయ బద్ధమైన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. పలువురు పెన్షనర్లు మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్ జనవరి, ఫిబ్రవరి నెలల్లో అందించాలని, ఆన్‌లైన్‌లో కూడా స్వీకరించాలని కోరారు. పెన్షన్‌దారుడు మరణిస్తే అందించే రూ.25 వేలు కుటుంబ సభ్యుల సెల్ఫ్ డిక్లరేషన్‌తో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ సీసీ బి.వెంకటేశ్వరరావు, కైకలూరు ఎస్‌టీఓ బి.మురళీకృష్ణ, ఎంఎస్‌డీ బి.ప్రసాద్, కె.హనుమంతరావు వి.లక్ష్మీనారాయణ, కె.ఉదయరత్నం పాల్గొ న్నారు.

సోషల్ మీడియా సభ్యులకు 14రోజుల రిమాండ్

గుడివాడరూరల్: గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, సోషల్ మీడియా సభ్యులకు 2022 డిసెంబర్ 25వ తేదిన జరిగిన ఘర్షణకు సంబంధించి 10 మంది సోషల్ మీడియా సభ్యులను గుడివాడ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో వన్‌టౌన్ పోలీసులు బుధవారం రాత్రి హాజరుపర్చారు. కాగా న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ తీర్పు ఇచ్చారు. వీరిని నెల్లూరు సబ్ జైల్‌కు తరలించనున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అన్నదాతకు ఎంత కష్టం..!

తుపాను ప్రభావంతో రైతన్నకు అంతులేని కష్టాలు వచ్చి పడ్డాయి. వర్షం తగ్గిందనుకునేలోపే పడిపోయిన వరిచేలల్లో వర్షపు నీటిని బయటకు పంపాల్సి వచ్చింది. దీంతో పాటు కోత, కట్టేత, తడిసిన వరి పనలను ట్రాక్టర్లకు ఎగుమతి, ఆ తడిసిన పనలను రోడ్లపై ఆరబోసేందుకు అయ్యే రవాణాతో సహా రెట్టింపు ఖర్చులతో రైతుకు అదనపు భారంగా మారాయి. పంటను గట్టుకు చేర్చుకుని ధాన్యం చేతికి రావాలంటే.. ఎకరానికి వచ్చేసరికి రూ.20వేల నుంచి రూ.25వేల వరకు ఖర్చవుతోందని రైతులు వాపోతున్నారు.

– గుడ్లవల్లేరు


కొతవరంలో పడిపోయిన వరిని కోస్తున్న కూలీలు


బలపామపురంలో రోడ్డుపై తడిసిన వరి పనల ఆరబోత


గుడ్లవల్లేరులోని తన పొలంలో వర్షపునీటిని తోడేందుకు ఇంజిన్‌ను తీసుకెళుతున్న రైతు


పద్మాలపాలెంలో కట్టేత కడుతున్న దృశ్యం


వేమవరంలో తడిసిన వరి పనలను ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న రైతులు